క్లుప్తంగా

అలరించిన స్వరనీరాజనం



విజయవాడ కల్చరల్: సీనియర్ గాయని బాల సరస్వతి సినీ రంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ గాయకుడు బాలాజీ కుమార్ అన్నారు. నగర గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద శనివారం కలసిపాడుదాం పేరుతో బాలసరస్వతికి స్వర నీరాజన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గాయని బాల సరస్వతి అన్నారు. తొలి తరం గాయనిగా ఆమె సినీ రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, సీహెచ్ బాబు పాల్గొన్నారు. వడ్డాది సూర్యకామేశ్వరి, నరసింహాచార్యులు, శ్రీనివాసరావు, దుర్గ, రైల్వే శ్రీనివాస్ పలు చిత్రగీతాలను ఆలపించారు.

25న మెగా లోన్‌మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఈ నెల 25వ తేదీ బుధవారం వేదిక కల్యాణ మండపంలో మెగా లోన్‌మేళా నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో అన్ని ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు పాల్గొని అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తాయని పేర్కొన్నారు. వివిధ రకాల రుణాలకు రాయితీలు, ప్రభుత్వం నుంచి డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ తదితర సహకారాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అందిస్తుందని తెలిపారు. అన్ని రకాల బ్యాంకుల సేవలు ఒక్కచోటే లభించే సదవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిలో పాల్గొనేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 63059 41717, 80747 30408లో సంప్రదించాలని సూచించారు.

24న వాహనాల బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ వెస్ట్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 24వ తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెస్ట్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలోని వెస్ట్‌స్టేషన్ పరిధిలో ఆ రోజు ఉదయం 9 గంటలకు మొత్తం 5 వాహనాలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు టూవీలర్స్‌కు రూ. 5వేలు, త్రీ వీలర్స్‌కు రూ. 10వేల చొప్పున తిరిగి చెల్లించే ఈఎండీ అందజేయాలని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పూర్తి వివరాలకు 94409 02455,99595 10446 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్యనారాయణపురం పీఎస్ సీఐ. ఎం వెంకటనారాయణ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాము సీపీ ఆదేశానుసారం సమస్యాత్మక ప్రాంతాల్లో రోజూ తనిఖీలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా స్టేషన్ సమీపంలోని ఏలూరు లాకుల వద్ద అనుమానితుల వివరాలు సేకరించి ఫుట్‌పాత్‌పై, రోడ్లపై నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఉత్సాహంగా నలంద స్పార్కిల్ 2కే 23



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు నలంద డిగ్రీ కళాశాలలో శనివారం స్పార్కిల్ 2కే23 మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించారు. నగరంలోని పలు కళాశాలలకు చెందిన మేనేజ్‌మెంట్ విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ చదువుతో పాటు, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. గెలుపు కంటే పోటీల్లో పాల్గొనడం ముఖ్యమన్నారు. మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించటానికి వేదికగా ఉంటుందన్నారు. బీబీఏ ఎనలిటిక్స్ విద్యార్థులు, అధ్యాపకుల పర్యవేక్షణలో క్విజ్, పోస్టర్ మేకింగ్, స్పెల్‌బీ, హెచ్ఆర్ ఎనలిస్ట్, మార్కెట్ ఎనలిస్ట్, ఫైనాన్షియల్ ఎనలిస్ట్, డ్యాన్స్, స్పాట్ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించామన్నారు. బహుమతీ ప్రదానంలో మాచవరం పీఎస్ ఎస్ఐ నాగమణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, చిత్రంలో డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటా నవరత్నాల వెలుగులు కనిపిస్తున్నాయని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 228వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి సుందర్‌పాల్, అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాత, మహిళలు, విద్యార్థులను పలకరిస్తూ.. వారికి అందుతున్న పథకాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

జూన్ నాటికి 8,237 గృహ ప్రవేశాలు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని తెలిపారు. పేదలపై ప్రత్యేక శ్రద్ధతో నియోజకవర్గంలో రూ. 179.62 కోట్లు వెచ్చించి 428.62 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షల చొప్పున రూ. 409.57 కోట్లు మొత్తంగా రూ. 589.19 కోట్లు పేదల గృహాలకు కేటాయించినట్లు వివరించారు. తొలి దశలో 13,892 ఇళ్లు ఉండగా.. నున్న, కొండపావులూరు, సూరంపల్లిలో 8,237 ఇళ్లు 50 శాతానికి పైగా నిర్మాణం పూర్తి చేసుకున్నట్లు వివరించారు. జూన్ నాటికి గృహ ప్రవేశాలు చేస్తామన్నారు. ఉగాది నాటికి 1,800 ఇళ్లను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా పని చేశారని టీడీపీ పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో దొడ్డిదారిన మంత్రి పదవి అనుభవించిన నారా లోకేష్ ప్రజలకు చేసిందేమిటో తెలిపి ఆ తర్వాత పాదయాత్ర చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో విధులకు రండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



నగర పర్యటనలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు హాజరుకావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం సర్కిల్–3 పరిధిలోని నాలుగో డివిజన్ గురునానక్ కాలనీలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హాజరు వివరాలను సచివాలయాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. రోజూ చెత్త సేకరణకు, డ్రెయిన్లు శుభ్రపరచడానికి సిబ్బంది వస్తోందీ లేనిది స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, చెత్త సేకరణకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి మాత్రమే అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాల్వలో మురుగు పారుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరికథాగానప్రపూర్ణ విశ్వనాథ భాగవతార్



విశ్వనాథ భాగవతార్ జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేదాంతం రామలింగశాస్త్రి

విజయవాడ కల్చరల్: హరికథా గానప్రపూర్ణ విశ్వనాథ భాగవతార్ అని కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి అన్నారు. అమ్ముల సార్మక సమితి, ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో అమ్ముల 107వ జయంతి, సార్మక పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంగీత సాహిత్యాలను మేళవింపుగా కథను వివరించడంలో అమ్ముల మొదటి స్థానంలో ఉంటారని తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హరికథలను సంప్రదాయ కళగా గుర్తించి ప్రతి దేవాలయంలో హరికథా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సంగీత విద్వాంసుడు పోవూరి గౌరీనాథ్ మాట్లాడుతూ విశ్వనాథ భాగవతార్ విశేషాలను తెలియజేశారు. 2023 సంవత్సరానికి అమ్ముల విశ్వనాథ భాగవతార్ పురస్కారాన్ని ముదపాక సుందర భాగవతార్‌కు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ అయన పురస్కారం అందుకోవడం జీవితంలో మరచిపోలేని ఘట్టంగా భావించానన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ భాగవతార్ కుటుంబ సభ్యులు అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గాభవాని పాల్గొన్నారు.

రవాణా కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీటీసీ పురేంద్ర

విజయవాడ స్పోర్ట్స్/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఉప రవాణా కమిషనర్(డీటీసీ) ఎం.పురేంద్ర అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని ఉప రవాణా కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యాలయం పరిధిలోని భారీ వాహనాల డ్రైవర్లకు, స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లు 350 మందికి ఉచితంగా కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డీటీసీ మాట్లాడుతూ ఎంతో మంది వ్యక్తులను నిత్యం వారి గమ్య స్థానాలకు చేర్చే డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రధానంగా కంటి చూపు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్.ప్రవీణ్, ఆర్.జగదీశ్వరరాజు, రాష్ట్ర రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజబాబు, ఎంవీఐలు కె.వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఏవో సి.హెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలామ్ సేవా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడిగా 'అవుతు'

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీజే అబ్దుల్ కలామ్ సేవా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ట్రస్ట్ చైర్మన్ షేక్ వజీర్ అహ్మద్ నియామక పత్రాన్ని శనివారం కార్యాలయంలో శ్రీనివాసరెడ్డికి అందజేసి అభినందించారు. సభ్యులు షేక్ వలి, షేర్ ఇర్ఫాన్, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అలంకార్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, పాపయ్య స్ట్రీట్, నర్రా వారి స్ట్రీట్, జీఎస్ రాజు రోడ్డు, అలంకార్ సెంటర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

25లోపు ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయాలి

జిల్లా సైన్స్ అధికారి ఎం. హుస్సేన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్పైర్ మనాక్ 2021–22 జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్ జరుగుతాయని జిల్లా సైన్స్ అధికారి ఎం, హుస్సేన్ శనివారంఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఎంపికైన 376 ప్రాజెక్ట్‌లను ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్స్ ప్రాజెక్టులు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల నుంచి 10శాతం అనగా 38 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి, వాటి నుంచి నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికకావచ్చని తెలిపారు. ప్రభుత్వ పారితోషికం విద్యార్థుల ఖాతాలో జమ కాని వారు కూడా తక్కువ ఖర్చుతో వర్కింగ్ మోడల్ చేసి విద్యార్థి వివరణతో తన వినూత్న ఆలోచనను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. గైడ్ టీచర్స్ గూగుల్ ప్లే స్టోర్‌లో ఇన్‌స్పైర్ మనక్ కాంపిటేషన్ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. ప్రాజెక్ట్ వీడియో (2 నిమిషాల వ్యవధి/30ఎంబీ లోపు), ఆడియో (రెండు నిమిషాలు వ్యవధి), ప్రాజెక్ట్ కు సంబంధించి గరిష్టంగా 4 ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి 1000 పదాలకు మించకుండా ఇంగ్లిషులో వివరణ ఇవ్వాలని తెలిపారు. వివరాలకు 98486 32062, 94408 83861, 73863 11633, 98665 28299 నంబర్లలో సంప్రదించాలని సైన్స్ అధికారి హుస్సేన్ కోరారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని చిరకాల సమస్యలను కూడా పరిష్కరించామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ జెండా చెట్టు వీధిలో రూ. 15.69 లక్షల వ్యయ అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించామన్నారు. రూ. 8 లక్షలతో జెండా చెట్టు వీధి, రూ.7.69 లక్షల నిధులతో జెండా చెట్టు క్రాస్ వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. 20 రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 63వ డివిజన్ ఎంఐజీ కాలనీ, సీ కాలనీల్లో రూ.1.35 కోట్ల వ్యయ అంచనాతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే విష్ణు శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్లలో డివిజన్లో రూ.2.92 కోట్లతో రోడ్లు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, శ్రీరాములు, అనిల్, చిన్నారి, శివ, రమేష్ పాల్గొన్నారు.

తెలుగువారి మదిలో ఏఎన్నార్



అక్కినేని నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మదేశం వసంతకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు తన నటనతో తెలుగువారి హృదయాల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్నారని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మదేశం వసంతకుమార్ కొనియాడారు. దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో ఒకరోజు ముందుగా శనివారం ఏఎన్నార్ తొమ్మిదో వర్ధంతి జరిగింది. ఆయన సొసైటీ సభ్యులతో కలిసి అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. మండా రాము, కె.ప్రసాద్, జాని, పైడిపాటి వెంకన్న, గుర్రం ఏడు కొండలు, మాతృదేవోభవ నిర్వాహకులు జ్ఞానేంద్ర, దుర్గాంబ పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాసు ఆశయాలతో ముందుకెళ్లాలి



శాంతి ర్యాలీ చేస్తున్న వాకర్స్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్నేషనల్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్.ఆళ్వార్‌దాసు ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని వాకర్స్ జిల్లా గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు అన్నారు. ఆళ్వార్ దాస్ 20వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన సింగ్‌నగర్‌లో శనివారం శాంతి యాత్ర నిర్వహించారు. ఆయన ఆళ్వార్‌దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ నడక వల్ల మనకు కలిగే మేలును గుర్తించి, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నడిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ఆళ్వార్ దాస్ మొట్టమొదటిగా ప్రచారం సాగించి, వాకర్స్ ఇంటర్నేషనల్‌ను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో శాంతిర్యాలీ నిర్వహించారు. జిల్లా కేబినెట్ సెక్రటరీ పీవీడీ ప్రసాద్, ట్రెజరర్ కె.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం ఆవరణలో శనివారం ఆళ్వార్‌దాసు వర్ధంతి జరిగింది. ఎంబీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ పాల్గొని ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు నెమలికంటి భవానీప్రసాద్, సభ్యులు ఎస్‌కే మస్తాన్, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చట్టాలపై ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే అవగాహన పెంచుకోవాలని అజిత్‌సింగ్‌నగర్ సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. జయహో వాకర్స్ క్లబ్ విజయవాడ ఆధ్వర్యాన శనివారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశ ప్రజలకు లేని స్వేచ్ఛ, సమానత్వం మన దేశంలో మాత్రమే ఉన్నాయని, ఈ దేశంలో జన్మించడమే గొప్ప పుణ్యంగా అందరూ భావించాలన్నారు. సత్ప్రవర్తనతో జీవించడం, చట్టాలను గౌరవించడం, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తే జీవితం అందంగా ఉంటుందన్నారు. పెరుగుతున్న టెక్నాలజీని కేవలం మన అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. చాలామంది చిన్నారులు సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత ఆన్‌లైన్ గేమ్‌లకు, అశ్లీల చిత్రాలు, వీడియోలు చూడడానికి అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల జీవితాలు అంధకారంగా మారుతాయన్నారు. ట్రాఫిక్ ఎస్సై రంగయ్య, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, జయహో వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ, బి.ఆంజనేయులు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.